# క్షమయా ధరిత్రీ

శారద ఆదర్శ పత్ని అనే చెప్పుకోవాలి. ఈ ఆధునిక యుగంలో అటు భర్తనూ, ఇటు ఇద్దరు పిల్లల్నీ అదుపుచేసుకుంటూ తన సంసారాన్ని నలుగురూ మెచ్చుకునేలాగానూ, అసూయపడేలాగానూ తీర్చిదిద్దుకుంటోంది. తను ఆఫీసరుద్యోగం చేస్తూ కూడా ఇంటి పనులకూ, వంట పనులకూ పనివాళ్ళను పెట్టకుండా వంతులవారీగా అంతా పనిచేసే ఏర్పాటు చేసింది.

ఆ ఇంట్లో ఆధునిక సదుపాయాలు చాలా వున్నాయి. వంటలకు మైక్రో ఓవెన్, గిన్నెలకు డిష్ వాషర్, బట్టలకు ఆటోమేటిక్ వాష్ మెషీన్ వగైరా వగైరాలు... అయినా తీరిక సమయాల్లో పర్సులల్లి, పెయింటింగ్స్ వేసి – మరికాస్త డబ్బు సంపాదిస్తూంటుంది శారద.

భర్త శారదను కల్పవృక్షమనీ, కామధేనువనీ మెచ్చుకుంటాడు. అన్నింటికీ మించి ఆమె సహనమూర్తి.

పదిహేనేళ్ళ కాపురం తర్వాత ఆమె సహనానికి పరీక్ష వచ్చింది.

ఏడాది క్రితం ఆ ఇంట్లో ఓ అనాథ బాలుడు అడుగుపెట్టాడు. వాడి వయసు పది. చదివేది ఆరు. పేరు రాము.

ఆర్నెల్లలో వాడు శారదకెంతో చేరువయ్యాడు. ఆ ఇంటి సభ్యుల్లో ఒకడయ్యాడు.

స్వతహాగా శారదది జాలిగుండె. అనాథ బాలుడన్న భావంతో ఆమె వాడికి తల్లి లేని లోటు తీర్చాలని ప్రత్యేక ప్రయత్నం చేసింది. అది ఫలించింది.


రాము శారద ప్రేమాభిమానాల మీద పూర్తి నమ్మకం కుదిరేక, "అమ్మా! నువ్వింత మంచి దానివి. నాన్న నీకు నా గురించిన నిజం చెప్పకుండా దాచిపెడతాడేం?" అన్నాడు – నిన్నటి దినం!

"ఏమిటా నిజం?" అంది శారద యధాలాపంగా.

రాము తన పెట్టె తెరిచి ఆమెకో ఫోటో ఇచ్చాడు. అందులో అందంగా నవ్వుతూ ఆ నవ్వుకంటే అందంగా వున్న యువతి వుంది. ఆ యువతి పక్కన శారద భర్త వున్నాడు.

"మా అమ్మ!" అన్నాడు రాము ఆ యువతిని చూపించి.

అప్పుడు శారద గుండెలో బాంబు పేలింది. అదామె గుండెనూ, మనసునూ ఛిన్నాభిన్నం చేసింది.



ఆ రాత్రి శారద భర్తను నిలదీసింది.

కథ పాతదే!

అందమైన అమ్మాయి... బలహీన క్షణం...

రాము తల్లి సంప్రదాయాన్ని నమ్ముతుంది. ఆడదానికి ఒక్కసారే పెళ్ళి అంటుంది. మెడలో తాడు, పాపిట్లో సింధూరంతో కాక రెండు శరీరాల కలయికతోనే పెళ్ళి అవుతుందని ఆమె అనుకుంది. ఆ విధంగా రాముకు తల్లి అయింది. వాడి పోషణ భారాన్ని తను స్వీకరించింది. అర్ధాంతరంగా మరణించింది.

రాము ఎవరో చెప్పకుండా వాడినింటికి తెచ్చాడు శారద భర్త.

వాడెవరో తెలియనప్పుడు గుండెలో పెట్టుకుంది శారద. వాడెవరో తెలియగానే ఆమె గుండె బద్దలయింది.

భర్త తన తప్పొప్పుకున్నాడు. క్షమించమన్నాడు.

శారద వ్యక్తిత్వమున్న స్త్రీ. ఆమె తీవ్రంగా ఈ విషయమై ఆలోచించింది. భార్యాభర్తల ప్రేమానురాగాలకూ, సహజీవనానికీ పునాది నమ్మకం. భర్త ఆ నమ్మకంపై దెబ్బ తీశాడిప్పుడు. ఇంకా తనతడిని విడిచిపెట్టకపోతే అది అసహాయత, ఆత్మవంచన అవుతుంది.

తన పిల్లల్ని తానే పోషించుకోగల శారద, వ్యక్తిత్వానికి ప్రాధాన్యత నిచ్చే శారద – విడాకుల గురించే ఆలోచించింది. అయినా ఒక్కసారి జలజతో మాట్లాడాలనుకుంది.

జలజ అయిదేళ్ళుగా శారదకు స్నేహితురాలు. ఆమె సంప్రదాయాన్ని నమ్ముతూ విచక్షణను పాటించే వివేకవంతురాలని శారద నమ్మకం.

తన తెలివిపై తనకు నమ్మకమున్నప్పటికీ తన విషయంలో ఎదుటివారి అభిప్రాయం తెలుసుకోవడం మంచిదని తోచి శారద మర్నాడు జలజను కలుసుకుని వీలయినంత శాంతంగా విషయాన్నామెకు చెప్పింది.

"ఇలాంటి సినిమాలు వస్తున్నాయి. పిల్లల భవిష్యత్తు కోసం భర్తను క్షమించడమే మంచిదన్న సందేశాన్నవి ఇస్తే – మహిళా ప్రేక్షకుల ఆదరణవల్లే అవి బాక్సాఫీసు హిట్లయ్యాయి"

జె. రామలక్ష్మి

అంది జలజ.

"నీ సలహా ఏమిటి?" అంది శారద.

"తప్పుచేసిన ఆడదాని మీద రకరకాల ఆంక్షలు పెట్టి శిక్షిస్తారు. ఈ సినిమాలు చూస్తుంటే – దర్శకుడి సింపతీ అంతా తప్పు చేసిన ఆ కథానాయకుడి మీదే వుంటుంది. పోనీ అన్ని ఆడది తప్పు చేస్తే మగాడు క్షమించే కథలుండవు. అలాంటిది వచ్చినా ఆడదాని తప్పు మగాడికి బుద్ధి చెప్పడం కోసం సృష్టించబడ్డ కల్పన అవుతుంది. ఈ సమాజంలో మగాడికో న్యాయం, ఆడదానికో న్యాయం!!

"అందుకే నేను విడాకులు తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాను. నా నిర్ణయానికి బలం కోసం – నీ దగ్గర కొచ్చాను..." అంది శారద.

"విడాకులు ఆడదానికే శిక్ష. మగాడికి కాదు. నువ్విలా విడాకులివ్వగానే నీ భర్తకు పిల్లనివ్వడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు క్యూలో నిలబడతారు. అంతో ఇంతో కట్నం కూడా పలుకుంది. నీకే మగతోడు లేకుండా పోతుంది". "అనుభవించింది చాలు. ఇంకా నాకు మగతోడక్కర్లేదు..."

"అలాగనకు. మంచికో, చెడుకో పెళ్ళి చేసుకున్నావు. పదిహేనేళ్ళు మీరిద్దరూ కలిసి కాపురం చేశారు. అందువల్ల ఎంతో కొంత ఆపేక్ష ఒకరి పట్ల ఒకరికి వుంటుంది. క్షమ యాధరిత్రీ అన్నారు పెద్దలు మన ఆడవాళ్ళ గురించి! ఒక్కసారికి క్షమించు. కానీ క్షమించడమంటే క్షమించి ఊరుకోవడం కాదు. ఇకమీదట నీ భర్త సరిగ్గా ఆఫీసు టైముకి పది నిముషాల ముందు ఇంట్లో బయల్దేరి, ఆఫీసు విడిచిపెట్టగానే ఇల్లు చేరాలి. నీ అనుమతి లేనిదే ఇల్లు, ఆఫీసు విడిచిపెట్టి బయటకు వెళ్ళకూడదు. ఇంట్లో వున్నప్పుడు నువ్వు చేసే పనులన్నీ అతడే చేయాలి. ఇంటికి వచ్చిన అతిథులకు కాఫీ, టీలు కలపడం, ప్లేట్లలో అన్నీ సర్ది తేవడం చేస్తూండాలి. ఎవరైనా అదేమని అడిగితే తనకు స్వేచ్ఛనుపయోగించుకోవడం తెలియదని ఒప్పుకోవాలి. నీ అనుమతి లేనిదే దగ్గర చుట్టాలయినా సరే ఆడవాళ్ళతో మాట్లాడకూడదు.." అని ఆగి, "వీటన్నింటికీ

ఇది నిజం

* మెజోటికా అను ఆదివాసి తెగవారు ఈలభాషలో మాట్లాడుకుంటారు.

–సూర్యతేజ

మీ ఆయనొప్పుకుంటాడుగా..." అంది జలజ.

"ఊ ఆయనే కాదు – ఏ మగాడూ ఒప్పుకోడు..." అంది శారద.

"ఏ మగాడి సంగతో నీ కనవసరం. మీ ఆయన తప్పు చేశాడు. అదెలాంటి తప్పంటే అదే తప్పు నువ్వు చేస్తే అతడు క్షమించను కూడా క్షమించలేడు. కాబట్టి తన తప్పుకతడు సిగ్గుపడాలి. కుంచించుకుపోవాలి. కొన్నేళ్ళపాటు నలుగురిలో గర్వంగా తలెత్తుకు తిరక్కూడదు.. ఇలాంటి శిక్షలు లేకుంటే అలాంటి తప్పులు చర్విత చర్వణాలవుతూంటాయి. అర్థమయిందా?" అంది జలజ.

శారద జలజకు కృతజ్ఞతలు చెప్పుకుంది. ఇంటికి తిరిగి వెళ్ళింది.

ఆ రాత్రి భర్త ఆమె అభిప్రాయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూ కనిపించాడు.

శారద అతడి వంక పరీక్షగా చూసింది.

కళ్ళలో తప్పు చేశానన్న భావం...

కదలికలో అదురు బెదురు...

శారద ఆలోచనలో పడింది.

దొంగతనం చేసిన నేరస్థుడిని జైల్లో పెట్టి గళ్ళ బట్టలు తొడుగుతారు. దొంగ తప్పొప్పుకున్నా, సిగ్గుపడినా చేసిన నేరానికి శిక్ష అనుభవించక తప్పదు.

సంసార జీవితంలో తన భర్త తప్పు చేశాడు. అతడికీ శిక్ష తప్పదు.

జలజ కొన్ని శిక్షలు సూచించింది. కానీ ఆమెకింకా గొప్ప శిక్ష తడుతోంది. ఇంట్లో అతడు గళ్ళ యూనిఫాంలో తిరగాలి... అంతే!

శారద భర్తనే చూస్తోంది. గళ్ళ యూనిఫాంలో అతడిని ఊహించుకుంటోంది.

"మాట్లాడు శారదా! నా తప్పును క్షమించమని అడిగే అర్హత కూడా నాకు లేదని తెలుసు. ఆ మాటే నువ్వు అన్నా నేను భరించగలను. కానీ మాట్లాడు."

శారదకు అతడి తప్పు గురించీ, తన శిక్ష గురించీ మాట్లాడాలనే వుంది. కానీ ఆమెకు నోట మాట రావడం లేదు. అతడిని అవమానానికి గురిచేస్తున్న అనుభూతిని పొందుతోంది. ఈ తప్పును క్షమించాలనే నిర్ణయం ఆమెలో పుట్టి బలపడుతోంది.

చివరకామె, "మీరు తప్పు చేసిన దానికంటే తప్పును దాచినందుకు నేనెక్కువ బాధపడ్డాను. మీరు నా నమ్మకాన్ని దెబ్బ తీశారు. నన్ను నమ్మకుండా అసలు విషయాన్ని దాచి రామును ఇంట్లో ప్రవేశపెట్టారు..." అంది.

అతడు తలను మరికాస్త వంచుకుని, "ఏ ముఖం పెట్టుకుని నీకీ విషయం చెప్పగలను? అనుకోకుండా జరిగిన తప్పును సరిదిద్దుకోలేక... నీకు చెప్పలేక... ఇన్నేళ్ళుగా సతమతమైపోతున్నాను..." అన్నాడు.

"వెంటనే అసలు విషయం నాకు చెబితే క్షమించడానికి నాకూ వెంటే మనస్కరించేది. తప్పును మీలో దాచుకోవడం వల్ల ఆ తప్పు నానాటికీ మీకు మరింత స్వంతమై – ఆ తప్పుకూ, మీకూ అవినాభావ సంబంధమేర్పడిపోయింది. ఇంకెప్పుడూ ఇలా జరగనివ్వనని మాటివ్వండి..." అంటూ చేయి చాపింది శారద.

అతడు తలెత్తకుండానే చేయి చాపి, "నీవెంత మంచిదానివని నాకు తెలుసు. అయినా నిజం దాచి ఇన్నేళ్ళు కష్టపెట్టాను. రాము తల్లి విషయంలో చేసిన తప్పు ఇంకెప్పుడూ చేయను. అందుకే మాలతి విషయం కూడా ఈ రోజు నీకు చెప్పేయదల్చుకున్నాను..." అంటూ ఆమె చేతిలో చేయి వేశాడు.

అది అమాయకత్వమని కొందరూ, మగవాడి బలహీనత అని కొందరూ, ప్రకృతి సహజమని కొందరూ అనవచ్చు. కానీ క్షమాపణతో సరిదిద్ద లేనిదీ, శిక్షార్హమైనదీ అయిన తప్పుగా దాన్ని గుర్తించనంతకాలం ఆడది మగాడి ఈ తప్పును ప్రోత్సహించినట్లే అవుతుంది.

శారద చటుక్కున తన చేయి వెనక్కు తీసుకుంది.

ఆమె ఇప్పుడు క్షమ గురించి కాక శిక్ష గురించే ఆలోచిస్తోంది. ●